



# తిరంగా ర్యాలీ




కులకచర్ల మండలంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయం నుంచి గ్రామంలోని వీధుల మీదుగా ర్యాలీ చేపట్టారు. ప్రధాని తీసుకునే ప్రతి నిర్ణయానికి యువత కట్టుబడి ఉండాలన్నారు. దాయాది పాకిస్థాన్‌ను మట్టి కరిపించేందుకు భారతీయులు సంసిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పరిగి ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనేటి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి)

# జై బోలో హనుమాన్‌కీ..



హనుమాన్ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమంతుడిని పూలు, పండ్లతో అందంగా అలంకరించారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరీ నవశక్తి ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, కొంతం అంజిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్, మే 22 (ఆంధ్రజ్యోతి)

## భాగ్యరెడ్డి వర్మను ఆదర్శంగా తీసుకోవాలి

▸▸ వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

మేడ్చల్ ప్రతినిధి/వికారాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ సంస్థానంలో 1906 - 1933 మధ్య కాలంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి విద్యాభివృద్ధికి గట్టి పునాదులు వేశారని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మేడ్చల్ కలెక్టరేట్‌లో..

ఎంవీ భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నివాళులర్పించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి, సాంబశివరావు, కాంతమ్మ, బాబు మోసెస్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు


# పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..

## పాఠశాలలు తెరిచే నాటికే పంపిణీకి సిద్ధం

పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేలా విద్యా శాఖ చర్యలు తీసుకుంటోంది. గతంలో సకాలంలో పాఠ్య పుస్తకాలు అందక విద్యార్థుల చదువులపై ప్రభావం పడేది. ఏటా ఇదే సమస్య పునరావృతం అవుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న విద్యా శాఖ రెండేళ్లుగా బడిగంట మోగే నాటికే పుస్తకాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర పాఠ్య పుస్తకాల ముద్రణాలయం నుంచి జిల్లా కేంద్రాలకు ఆర్టీసీ కార్గో ద్వారా పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పార్ట్-1 పాఠ్య పుస్తకాల్లో 85 శాతం జిల్లాకు చేరుకున్నాయి. ఈ నెలాఖరు నాటికి మండలాలకు పూర్తిస్థాయిలో సరఫరా చేయనున్నారు.



శివారెడ్డిపేటలో పాఠ్య పుస్తకాల సరఫరా కేంద్రంలో నిల్వ ఉంచిన కొత్త పాఠ్య పుస్తకాలు



| వివరాలు | |
|---|---|
| మొత్తం పాఠశాలలు | 1062 |
| విద్యార్థులు | 89,845 |
| అవసరమైన పుస్తకాలు | 7,09,390 |
| పార్ట్-1లో అవసరమైనవి | 5,27,290 |
| జిల్లాకు చేరినవి | 4,49,511 |
| ఇంకా రావాల్సినవి | 77,779 |

బడిగంట రోజే విద్యార్థులకు పంపిణీ

ఈనెలాఖరు నాటికి మండలాలకు సరఫరా

జిల్లా గోదాములకు చేరిన 85 శాతం పుస్తకాలు

వికారాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల యాజమాన్యాలకు సంబంధించి మొత్తం 1,062 పాఠశాలలు ఉండగా, ఈ పాఠశాలల్లో 89,845 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో జిల్లాకు 7,09,390 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయని అంచనా వేయగా, వీటిలో 5,27,290 పార్ట్-1 పాఠ్యపుస్తకాలను పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి సరఫరా చేయాల్సి ఉంది. పార్ట్-1 పాఠ్య పుస్తకాల్లో ఇప్పటివరకు 4,49,511 పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. ఇంకా 77,779 పాఠ్యపుస్తకాలు ముద్రణాలయం నుంచి రావాల్సి ఉంది. జిల్లాకు సరఫరా కావాల్సిన 1,81,160 పార్ట్-2 పాఠ్యపుస్తకాలను

మిగతా 8వ పేజీలో...



## మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి బదిలీ

మేడ్చల్ ప్రతినిధి, మే 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి గురువారం బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాలుగా విజయేందర్‌రెడ్డి ఇక్కడ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సౌమ్యుడిగా అందరి మన్ననలు అందుకున్నారు. ప్రస్తుతం సీఎం సొంత జిల్లా నారాయణపేటకు బదిలీపై వెళ్లారు. 20 రోజులుగా అదనపు కలెక్టర్ సెలవులో ఉన్నారు. గురువారమే విధుల్లో చేరడంతోపాటు అదే రోజు సాయంత్రం బదిలీ అవడం విశేషం.

## రాజబొల్లారంలో బీహార్ సర్పంచ్‌లు

మేడ్చల్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజబొల్లారం, నూతన్‌కల్ గ్రామాలను బీహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌ల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులతో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పంచాయతీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాల గురించి ఎంపీడీఓ వసంతలక్ష్మి వారికి వివరించారు.

# మసక మసక చీకటిలో..

## యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

రాత్రికి రాత్రే మాయమవుతున్న మట్టి.. రెచ్చిపోతున్న మాఫియా

ప్రభుత్వ ఆదాయానికి గండి.. పట్టించుకోని అధికారులు



మట్టిని తరలిస్తున్న టిప్పర్



ఏనెకు జరుగుతున్న మట్టి తవ్వకాలు

ఘట్‌కేసర్, మే 22(ఆంధ్రజ్యోతి): మసక మసక చీకటి.. భారీ యంత్రాలతో మట్టిని తోడి టిప్పర్లలో దొంగచాటున తరలిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదు. వారం రోజులుగా రాత్రి అయ్యిందంటే చాలు టిప్పర్లు, భారీ యంత్రాలతో ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధిలోని చందుపట్లగూడలో అందరి కళ్లుగప్పి మట్టిని తోడేస్తున్నారు. దీనిపై అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము ఐదు గంటల వరకు టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఈ తవ్వకాలు తహసీల్దార్ కార్యాలయానికి, పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరుగుతుండటం విశేషం.

### మాయమాటలు చెప్పి..

మట్టికి డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎవరూ సంచరించని లేఅవుట్లలోని ఓపెన్ ప్లాట్లలో అక్రమంగా మట్టి తవ్వాకాలు జరుపుతూ

మిగతా 8వ పేజీలో...

# ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ



వికారాబాద్/మేడ్చల్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గురువారం ప్రారంభమైన ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం ఫస్టియర్ ద్వితీయ భాష పరీక్షకు 1,003 మంది విద్యార్థులకు 927 మంది హాజరు కాగా, 76 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో విద్యార్థులు 863 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, వారిలో 804 మంది హాజరుకాగా, 59 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 140 మంది విద్యార్థులకు 123 మంది హాజరుకాగా, 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెకెండియర్ పరీక్షకు 275 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వారిలో 249 మంది హాజరుకాగా, 26 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 258 మంది విద్యార్థులకు 236 మంది హాజరుకాగా, 22 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 17 మంది విద్యార్థులకు 13 మంది హాజరుకాగా, నలుగురు గైర్హాజరయ్యారు. తొలిరోజు జరిగిన పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీసింగ్ కేసులు నమోదు కాలేదు.

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 12,601 మంది అభ్యర్థులకుగాను 952 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. 11,649 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల కన్వీనర్ తెలిపారు.



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి

## త్వరలో బాల అదాలత్ ప్రారంభం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి

వికారాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాల నివారణ, పిల్లల హక్కుల పరిరక్షణ కోసం బాల అదాలత్ కార్యక్రమాన్ని మొదటిసారిగా వికారాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ సమావేశంలో జూన్ మూడో వారంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించామన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, అన్ని శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా శిశు గృహాన్ని సందర్శించిన కమిషన్ సభ్యులు, వసతి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశం, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఆర్ఎంకు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వినతి



వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

తాండూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలతకు ఆ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో ఆర్ఎంకు జిల్లా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలిసి సమస్యలు వివరించారు. హెల్త్ కార్డులు, తాండూరు, పరిగి, వికారాబాద్ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పౌస్‌లకు డిస్పెన్సరీలో ఫొటోలు, వివరాల సేకరణకు కేంద్రాన్ని ఏర్పాటు చేయలని కోరారు. ఎంప్లాయీస్ సెలవు రోజుల డబ్బులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా రీజినల్ సెక్రెటరీ అబ్దుల్ జబ్బార్, రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎస్ సిద్ధికి, ఉపాధ్యక్షుడు వీరన్న, సంజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొనుగోలు కేంద్రాల పరిశీలన 7





పీహెచ్‌సీనా.. డిస్పెన్సరీనా?

ధారూరు ఆస్పత్రిలో సివిల్ డిస్పెన్సరీ స్థాయి సిబ్బంది విధులు 8

## జాతీయ బీసీ సేన మండలాధ్యక్షురాలిగా అనితాగౌడ్

చౌదరిగూడ, మే 22(ఆంధ్రజ్యోతి): కొందుర్గ మండల జాతీయ బీసీ సేన మహిళా అధ్యక్షురాలిగా ఈరపురం అనితాగౌడ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్ అసెంబ్లీ జాగీయ బీసే సేన మహిళా అధ్యక్షురాలు బాప వరలక్ష్మి ఆధర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఐనాల రాధ, ఉపాధ్యాక్షురాలు బోయ యాదమ్మ, కార్యదర్శి బోయ లక్ష్మి, కోశాధికారిగా కటిక అరుణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, మాజీ జడ్పీటీసీ మచ్చ సుధాకర్ రావు, జిల్లా ప్రదాన కార్యదర్శి జువ్వ సుధాకర్, నియోజకవర్గ కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్, సంఘం నాయకులు వెంకటేష్, ప్యాట జయ, శ్రీకాంత్, అనూష, బాల్‌రాజ్, సర్వసతి, లక్ష్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అనితాగౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయాదవ్

## పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

నందిగామ, మే 22(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేరుస్తామని, వారి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం నందిగామ మండలంలోని అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ. నర్సప్పగూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి భూమిపూజ చేశారు. మొదటి విడతలో నర్సప్పగూడలో 27, అంతిరెడ్డిగూడలో 29, జంగోనిగూడలో 9 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అర్హులకే ఇళ్లు కట్టిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందని తెలిపారు. అదే విధగా అంతిరెడ్డిగూడలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న పాఠశాల భవనానికి ఆయన భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు జంగ నర్సింలు, శివశంకర్‌గౌడ్, దేపల్లి కుమార్‌గౌడ్, కొమ్ముక్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి శంకరయ్యగౌడ్, మల్లేష్‌గౌడ్, రామస్వామిగౌడ్, యాదయ్యగౌడ్, రాజేందర్, అంజియాదవ్, రమేష్, అంజనేయులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



















## లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని మార్కెట్ యార్డ్ దుకాణ సముదాయం
- కాంట్రాక్టర్‌కు నేటికీ అందని బిల్లులు
- 8 నెలలుగా వృథాగా ఉన్న మార్కెట్ షటర్లు
- టెండర్లు నిర్వహించక ఆదాయాన్ని కోల్పోతున్న మార్కెట్ యార్డ్



నిర్మాణం పూర్తయినా ప్రారంభించని దుకాణాలు

ఆమనగల్లు, మే 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో దుకాణ సముదాయం నిర్మించి ఆరు నెలలు గడిచినా నేటికీ అది ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో మార్కెట్ యార్డ్ ఆదాయాన్ని కోల్పోతుంది. దుకాణాల ప్రారంభం విషయంలో మార్కెట్ పాలకవర్గం, మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో 8 దుకాణాల(షెటర్ల) సముదాయ నిర్మాణానికి రూ.65లక్షలు మంజూరు అయ్యాయి. 2023 ఆగస్టు 18న వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిల పర్యవేక్షణలో పనులు కొనసాగాయి. పనులు పూర్తయినా పూర్తిస్థాయిలో బిల్లులు రాక వాటిని కాంట్రాక్టర్ చాలాకాలం స్వాధీనం చేయలేదని తెలుస్తోంది. రూ.65లక్షలకు రూ.25.83లక్షల బిల్లులే చెల్లించారు. ఇటీవల దుకాణాలను మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు యార్డ్ అధికారులకు వాటిని స్వాదీనపరిచారు. దీంతో దుకాణాల ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని అనుసరించి ఉన్న ఆక్రమణలు తొలగించారు. దుకాణాలకు విద్యుత్ మీటర్లు బిగించారు. అయితే వ్యాపారులకు కేటాయించేందుకు టెండర్ ప్రక్రియ ప్రారంభించ లేదు. దీంతో రెడీ అయిన దుకాణాలు 8 నెలలుగా వృథాగా ఉన్నాయి. దీంతో మార్కెట్ కమిటీ ఆదాయాన్ని కోల్పోతోంది. దుకాణాలను ప్రారంభించేందుకు పాలకవర్గం చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 22(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పారు. దీంతో మహిళలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, తహసీల్దార్ ఆనంద్‌రావు, కమిషనర్ వెంకటయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు అంజనేయులు, డి.అశోక్, తావుర్యానాయక్ పాల్గొన్నారు.

### ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

పూడూరు: ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడమే తమ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండల పరిధి దేవనోనిగూడకు చెందిన ఎన్.పాండయ్య భార్య అనంతమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఈ మేరకు ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికింద మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ఆమె కుటుంబానికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నవాబుపేట, మే 22(ఆంధ్రజ్యోతి):అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం నవాబుపేట మండలం చివంచల్‌పేట్‌లో నిర్మించబోయి ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేకనే విపక్షాలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గీతారాథోడ్‌సింగ్, ప్యాక్స్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, వైస్‌చైర్మన్ బల్వంత్‌రెడ్డి, డైరెక్టర్ ఖదీర్, బాల్‌రాజ్, నర్సింహారెడ్డి, బలరాం, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రావుగారి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు తలారి ప్రభాకర్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య



వడ్లలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారి ఎన్.మోహన్ రెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కొడంగల్ రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పర్సాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను విక్రయించాలని సూచించారు. ధాన్యాన్ని తూర్పారబట్టి, బాగా ఎండబోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కేంద్రం నిర్వాహకులకు తెలిపారు. అనంతరం ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శంకర్‌రాథోడ్, ఏవో జి.తులసి, ఏఈఓ అశ్విని, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఖానాపూర్‌కు సబ్‌స్టేషన్ మంజూరు

● 26న డిప్యూటీ సీఎంతో శంకుస్థాపన

తలకొండపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామానికి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఉపకేంద్రం ఏర్పాటుకు గురువారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. ఈ నెల 26న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని కసిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో విద్యుత్ లో-వోల్టేజీ సమస్య నివారణకు అవసరమైన అన్ని గ్రామాల్లో అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సబ్ స్టేషన్‌కు స్థల మ్యాప్‌ను చూస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

## ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

చేవెళ్ల, మే 22(ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ చేసి ప్రజలకు బహిర్గతం చేయాలని, దేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మే 26 నుంచి 31 వరకు చేవెళ్లలో జనసేవదళ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, గురువారం శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగంలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... నక్సలైట్ల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కానీ వారితో సైద్ధాంతిక అంశాలపై చర్చించి పరిష్కారం వైపు అడుగులు వేయకపోవడం బాధాకరం అన్నారు. ఉగ్రవాదుల కంటే ఎక్కువ నక్సలైట్ల మీద ప్రతీకారం చర్యలకు పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. జనసేవ కార్యకర్తలు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయాల్లో ప్రజలకు అండగా నిలిచే కార్యకర్తలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యానారాయణ, పార్టీ నాలుగు మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, నాయకులు మంజుల, సుధాకర్‌గౌడ్, శివ, గోపాల్‌రెడ్డి, మొహినుద్దీన్ పాల్గొన్నారు.



చేవెళ్లలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాలమాకుల జంగయ్య తదితరులు

## పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం

కడ్తాల్, మే 22(ఆంధ్రజ్యోతి):మాజీసర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి విమర్శించారు. కడ్తాలలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 12,769పంచాయతీల్లో చేసిన వివిధ పనులకు మాజీ సర్పంచ్‌లకు రూ.1,200కోట్ల బకాయిలు రావాల్సి ఉండగా.. ప్రభుత్వం రూ.153కోట్లే విడుదల చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. పంచాయతీల వారీగా ఉన్న బకాయిలపై ప్రభుత్వం వైట్‌పేపర్ విడుదల చేయాలని జీఎల్ఎన్నార్ డిమాండ్ చేశారు. ఏడాదిగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించక ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ కార్యదర్శులే అప్పులు తెచ్చి ప్రజాసమస్యలు తీరుస్తున్నారన్నారు. తమ బిల్లులు పూర్తిస్థాయిలో విడుదల చేయకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమకార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభం

కీసర, మే 22(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన వైట్ టీషర్ట్ ఉద్యమాన్ని రాష్ట్రంలో మరింత ఉధృతం చేస్తున్నట్టు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కీసరలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించినట్టు చెప్పారు. 'కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికీ పురోగతి' అనే ప్రధాన అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చరణ్‌రెడ్డి తెలిపారు. రాంపల్లి దాయరలోని బాలవికాస కేంద్రంలో జరిగే శిక్షణ తరగతులను యువజన కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి/బొంరాస్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైస్‌మిల్లర్ల యజమానులను ఆదేశించారు. గురువారం పరిగి శివారులోని వెంకటసాయి రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా ధాన్యం తడిపోకుండా గోదాముల్లో నిల్వ చేయాలన్నారు. నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను ప్రారంభించి త్వరతగతిన పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ ఆనంద్‌రావు, టోక్యానాయక్, కట్కం బాలరాజ్ పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మెట్లకుంట ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ కొనుగోళ్లకు రైతులు సహకరించాలని, అవసరమైన లారీలు, గన్నీ బ్యాగులు పంపిస్తామని తెలిపారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ఇబ్బందులకు గురి కావొద్దని, రెండు రోజులపాటు లారీలు పంపిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, రైతుల ఖాతాల్లో రూ.64 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ఈ ఏడాది 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గత సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయని, జిల్లాలోని బాయిల్డ్ రైస్‌మిల్లులు 36 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్నాయని, మిగతా ధాన్యాన్ని పొరుగు జిల్లాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనవెంట తహసీల్దార్ పద్మావతి, ఏపీయం సాయన్న, సీసీలు యాదయ్య తదితరులు ఉన్నారు.



పరిగిలో రైస్ మిల్లు యజమానితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



## పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

పూడూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మిర్జాపూర్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మిర్జాపూర్‌లో మెస్సర్స్ సుందర్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రపోస్డ్ సైట్‌లో పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. కంపెనీ ఏర్పాటుపై స్థానికులు అభిప్రాయాన్ని మండలి అధికారులు సేకరించారు.



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్లు

## టీచర్లకు శిక్షణ అవసరం

పరిగి, మే 22 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు అవసరమని జిల్లా రిసోర్స్ పర్సన్లు నాగరాజు, నరసింహరాజు అన్నారు. పరిగిలోని జెడ్పీహెచ్ఎ్ నం:1లో స్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలతో విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, మండల రిసోర్స్ పర్సన్లు ఉస్మాన్‌అలీ, వీణ, వెంకటప్రసాద్, నరేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్, స్వప్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న రాందాస్ నాయక్, జవహర్‌లాల్

## ముగిసిన క్రికెట్ టోర్నీ

కడ్తాల్, మే22(ఆంధ్రజ్యోతి): మైసిగండిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం అట్టహాసంగా ముగిసింది. టోర్నీలో వారం రోజులు యువకులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత జట్లకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్ నాయక్ రూ.15వేలు, రన్నర్స్‌కు బీజేపీ జిల్లా నాయకుడు సభావట్ రాందాస్‌నాయక్ రూ.11వేలు సమకూర్చారు. శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి టీంలకు నగదు, షీల్డ్‌లను బహూకరించారు. క్రీడలు శారీర దారుఢ్యం, మానసిక వికాసానికి దోహదపడతాయని వారు అన్నారు. విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్యానాయక్, హీరాసింగ్, తులసీరామ్, శివ, మల్లేశ్, శ్రీను, కల్యాణ్, భాస్కర్, సుమన్, సాయికుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

కడ్తాల్, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కడ్తాల మండలం మైసిగండికి చెందిన ఇస్లావత్ విశాల్‌నాయక్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.44వేల చెక్కును గురువారం మైసిగండిలో స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రగతిని జీర్ణించుకోలేక విపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారానికి ఒడిగట్టాయని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సన్న బియ్యాన్ని అందిస్తున్న ఘనత రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు జవహర్‌లాల్‌నాయక్, హీరాసింగ్, తులసీరామ్‌నాయక్, రాజు, విజయ, శారద, గోపాల్, చందు, సాయి, బీచ్య, రమేశ్, బాష, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బొంరాస్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్‌గౌడ్, సీనియర్ నాయకులు బాబయ్యానాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రం, మెట్లకుంటలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో రైతుల తరపున ఆందోళన చేస్తామన్నారు. రైతులను పరామర్శించడానికి వస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజారాంరెడ్డి, అనిల్‌కుమార్, కేతావత్ రాజేందర్, కేతావత్ శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు నవీన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మొలకెత్తిన వడ్లను చూపుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు శ్రావణ్‌గౌడ్

# ఒక్క ఇల్లూ మంజూరు చేయని బీఆర్ఎస్ పాలకులు

» కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో కాలం ఎల్లదీసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ పేదలకు గూడు కల్పిస్తోందని అన్నారు. మండలంలోని జంగారెడ్డిపల్లిలో గురువారం ఎమ్మెల్యేతో కలిసి మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డిలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. అనంతరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. నియోజకవర్గానికి మొదటి విడత 4,500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరుచేస్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని నారాయణరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాములు, మాజీ సర్పంచ్ వరలక్ష్మీరాజేందర్‌రెడ్డి, నాయకులు రమేశ్‌యాదవ్, డేవిడ్, యాదయ్య, అజీజ్, రేణురెడ్డి, అంజయ్య, వెంకట్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అజీం, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, రవీందర్, నర్సింహ, యాదగిరి, నరేశ్, విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

### గ్రామంలో జై సంవిధాన్ పాదయాత్ర

అనంతరం జంగారెడ్డిపల్లిలో జై బాపు... జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల ఆశయాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఎమ్మెల్యే మండిపడ్డారు.

### అనర్హులకు ఇళ్లు మంజూరైతే రద్దు చేస్తాం

మాడ్గుల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. మాడ్గులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని కొందరు గ్రామస్తులు ఎమ్మెల్యేతో అన్నారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయలేదని చెప్పగా.. ఎమ్మెల్యే వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ప్రజలకోసం కష్టపడి పనిచేస్తున్నానని, తనను ఎవరూ ఏమీ అనొద్దని హెచ్చరించారు. అనర్హులకు ఇండ్లు మంజూరైతే వారి పేర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఇల్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే రద్దు చేయాలని, నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తప్పవన్నారు. అనంతరం ఇళ్ల లబ్ధిదాలకు నారాయణరెడ్డి ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా ఉన్న వారికే ఇళ్లు మంజూరు చేశారని కొందరు విమర్శించారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అన్వర్ పాషా, ఉపాధ్యాయులు

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పూడూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తారని, విద్యార్థుల భద్రత, సంరక్షణలో వారి బాధ్యత అతి ముఖ్యమైనదని జిల్లా ఏహెచ్‌టీయూ టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్ పాషా అన్నారు. గురువారం పూడూరులోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మానవ అక్రమ రవాణా, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ, తదితర చట్టాలపై ఉపాధ్యాయులకు వివరించారు. జేజే చట్టం ప్రకారం బాలల హక్కులు, వారి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, పోక్సో చట్టం కింద లైంగిక నేరాల నివారణ, శిక్షలు, బాధితులకు అందజేసే సహాయం తదితలపై గురించి వివరించారు. పిల్లలు ఏదైనా ప్రమాదంలో ఉన్నట్లు తెలిసినా, అసాధారణంగా ప్రవర్తిస్తున్నా ఉపాధ్యాయులు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసు శాఖ ద్వారా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్లు, ఏహెచ్‌టీయూ టీం హెడ్‌కానిస్టేబుల్ అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారుల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వికారాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో గ్రామ పాలనా అధికారులపరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పరీక్షలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వర్తించాలని, ఈ నెల 25న ఆదివారం వికారాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు గంటముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, ఏఓ పర్వీన్‌బేగం, సూపరింటెండెంట్ నేమత్ అలీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఈడీఎం మహమూద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

## పానాదిని పరిశీలించిన ఎస్ఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగీపూర్ నాపరాతి గనుల్లో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు రైతుల ఉపయోగం కోసం ఉన్న పానాది రోడ్డు మూసివేశాడు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'నాపరాతి వ్యర్థాలతో పానాది రోడ్డు మూసివేత' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి స్పందించారు. నాపరాతి గనులకు వెళ్లి పానాది రోడ్డుపై విచారణ జరిపారు. పానాదిని మూసేస్తున్న వ్యక్తిని కలిసి వివరాలు సేకరించారు. కొన్నేళ్ల క్రితం తమ పొలం నుంచే పానాది ఉండేదని, ఇటీవల పక్కనే కాల్వ తీసి ఒక సైడుకు పానాది వేసేలా చర్యలు చేపడతామని ఆ రైతు ఎస్ఐ వద్ద అంగీకరించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఓగీపూర్, కరన్‌కోట్, కర్ణాటక రాష్ట్రం చత్రసాలా గ్రామాలకు వెళ్లే పానాదిని నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఐ ఆదేశించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని సదరు రైతు తెలిపినట్లు ఎస్ఐ చెప్పారు. ప్రజల రాకపోకలకు వినియోగించే పానాదిని కబ్జా చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.



పానాదిలో రాళ్లు వేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

## డాక్టరేట్ పొందిన పండిత్ మహ్మద్‌కు సన్మానం

కోట్‌పల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి మండలం జడ్పీహెచ్ఎస్ ఎన్నారం పాఠశాలలో హిందీ పండిత్‌గా పని చేస్తున్న మహ్మద్ ముఖ్తార్‌కు గ్లోబల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ కొన్ని రోజుల క్రితం డాక్టరేట్‌ను ప్రకటించింది. థాయిలాండ్‌లో జరుగుతున్న గోల్డెన్ బుద్ధ ఎడ్యుకేషనల్ అవార్డ్‌లో భాగంగా గ్లోబల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ లండన్ వారి తరఫున గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మహ్మద్‌ను వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ డాక్టరేట్ ప్రదానోత్సవం తేదీ 23 నుంచి 28 మే 2025 వరకు థాయిలాండ్‌లో జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మునుపూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముఖ్తార్ అహ్మద్‌కు గ్రామీణ ప్రాంతాల్లో హిందీకి సేవలందించినందుకు గాను అవార్డు రావడం హర్షణీయం అని అన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

» ఇళ్ల యజమానులకు నోటీసులు

యాచారం, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారు. ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో 'సమస్యలున్నా పరిష్కారమేది?' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ, ఎంపీవో శ్రీలత స్పందించారు. నక్కర్తసింగారంలోని డంపింగ్ యార్డులోకి రైతులు వెళ్లకుండా కొందరు అడ్డుకోవడంతో రెండు రోజుల పాటు కుంటలో చెత్తవేశారని తెలిపారు. మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నామని, ఏ ఒక్క గ్రామంలోనూ పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాడైన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ధర్మన్నగూడ, నందివనపర్తి, నానక్‌నగర్, పిల్లిపల్లి, గున్‌గల్, మేడిపల్లి గ్రామాల్లో శిథిలమైన, పాడుబడిన ఇళ్ల యజమానులకు నోటీసులు జారీచేస్తున్నట్లు వెల్లడించారు. తాగునీటి పైప్‌లైన్‌లు లీకవకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటితొట్లలో 24గంటలూ నీరుండేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని తెలిపారు.



బతుకమ్మ ఘాట్ వద్ద అమెజాన్ సంస్థ ప్రతినిధులు

## అమెజాన్ సంస్థ సేవలు అమోఘం

కందుకూరు, మే 22(ఆంధ్రజ్యోతి): అమెజాన్ సంస్థ మండలంలోని కొత్తగూడ సున్నం చెరువు సుందరీకరణ పనులు చేపట్టడం గొప్ప విషయం అని ఇరిగేషన్ శాఖ డీఈ జగదీశ్వర్, కొత్తగూడ ప్రత్యేక అధికారి, కందుకూరు ఎండీవో సరిత హర్షం వ్యక్తం చేశారు. గురువారం కొత్తగూడ సున్నం చెరువుకట్ట, అలుగు, మరమ్మతులకు అమెజాన్ సంస్థ పనుల చేపట్టింది. సంస్థ ప్రతినిధులు ఆదిత్యచౌదరి, శంకర్‌ప్రసాద్, తాతాజీ, సురేష్‌లతో కలిసి పనులను ప్రారంభించారు. మండలంలోనే కొత్తగూడ సున్నం చెరువు పెద్దదని, ఈ చెరువు బ్యూటిఫికేషన్‌కు అమెజాన్ సంస్థ సొంత నిధులతో పనులు చేయించడం సంతోషకరంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఇలాంటి ప్రైవేట్ సంస్థలు కూడా ముందుకు రావాలన్నారు. చెరువు సుందరీకరణతో కొత్తగూడ, కొత్తూరు, గూడూరు, తుమ్మలూరు, మాల గూడూరు, బండమీది గూడూరు గ్రామాల్లో భూగర్భ జలమట్టాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ హబీబ్, మాజీ సర్పంచ్‌లు సాధ మల్లారెడ్డి, ఆర్.యాదయ్య, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, గ్రామస్తులు, రైతులు, అమెజాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

తలకొండపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరన్నపల్లి గ్రామంలో గురువారం గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కిట్లను సమకూర్చారు. ఆశా కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు వాటిని పంపిణీ చేశారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్త శోభ, నాయకులు రాఘవేందర్, యాదయ్య, భరత్, వెంకటేశ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఆశా కార్యకర్తలు, నాయకులు



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

## దళిత కిరణం భాగ్యరెడ్డి వర్మ

శంకర్‌పల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం భాగ్యరెడ్డి వర్మ చేసినకృషి మరువలేనిదని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. గురువారం సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్ గడ్డపై తొలి దళితపొద్దు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. సంఘంలోని దురాచారాలను రూపుమాపేందుకు కృషిచేశారన్నారు. అంటరాని కులాలన్నింటిని కలిపి ఆదిహిందూగా పిలవాలని ఆయన వాదించారని అన్నారు. హైదరాబాద్‌లోని ఇసామియా బజార్‌లో అంటరానివారి కోసం ఆయన ప్రాథమిక పాఠశాలను స్థాపించారని తెలిపారు. భాగ్యరెడ్డి దేశంలోనే అరుదైన సామాజిక ఉద్యమ నాయకుడని శ్లాఘించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, మాజీ కౌన్సిలర్లు చంద్రమౌళి, శ్రీనాథ్‌గౌడ్, అశోక్, నాయకులు ప్రవీణ్‌కుమార్, రాంరెడ్డి, అశోక్‌కుమార్, వెంకట్‌రెడ్డి, గోపాల్, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

తలకొండపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): జూలపల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు కొనసాగుతున్నాయి. మూడు రోజులు నిర్వహిస్తున్న వేడుకలకు భక్తులు భారీగా తరలొస్తున్నారు. గురువారం మంటప దేవతపూజలు, సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో పూజలు చేశారు. శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు



బొడ్రాయి పూజలో భీం భరత్ తదితరులు

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. గురువారం నాందార్‌ఖాన్‌పేట్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన, మైసమ్మ, గ్రామదేవతల విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు మానయ్య, పెంటారెడ్డి, యాదయ్య, బాలకృష్ణారెడ్డి, మల్లేష్‌గౌడ్, పద్మారెడ్డి, రాఘవేందర్, లింగారెడ్డి, శేఖర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వికసించిన మే పుష్పం



ధారూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ధారూరులోని ఓ ఇంటి పెరటిలో గురువారం మే పుష్పం వికసించింది. మహ్మద్ బాబాఖాన్ పెరటిలో యేటా మే నెలలో ఈ పుష్పం పుష్పించి చూపరులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం పెరటిలో ఎర్రని మే పుష్పం వికసించడం స్థానికులు చూసేందుకు ఆసక్తి చూపారు.

## బొంరాస్‌పేట్ ఎంపీడీవోగా వినోద్‌గౌడ్



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో వినోద్‌గౌడ్

బొంరాస్‌పేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ నూతన ఎంపీడీవోగా వినోద్ గౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణ ఫ్యాకల్టీగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు తనవంతుగా కృషి చేయనున్నట్లు తెలిపారు.

# పీహెచ్‌సీనా.. డిస్పెన్సరీనా?

- ధారూరు ఆస్పత్రిలో సివిల్ డిస్పెన్సరీ స్థాయి సిబ్బంది విధులు
- వైద్య ఆరోగ్యశాఖలో పీహెచ్‌సీగానే గుర్తింపు



ధారూరులోని ప్రభుత్వ ఆస్పత్రి

ధారూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ధారూరులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమా? సివిల్ డిస్పెన్సరీ ఆస్పత్రా? అనే మీమాంస కొనసాగుతోంది. ఆస్పత్రిలో ఇప్పటికీ సివిల్ డిస్పెన్సరీ స్థాయి సిబ్బందే విధులు నిర్వహిస్తున్నారు. కానీ వైద్య ఆరోగ్య శాఖ వారు మాత్రం ఈ ఆస్పత్రిని పీహెచ్‌సీగానే గుర్తిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఈ ఆస్పత్రి స్థాయి పెంచకుండా ఉన్న సిబ్బందితోనే ఆస్పత్రిని నడిపిస్తూ వైద్యసేవలను మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో గతంలో ఉండే సివిల్ డిస్పెన్సరీ స్థాయి పోస్టులు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో ఒక వైద్యాధికారి, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, వాటర్‌మెన్, అటెండర్, ఎఫ్ఎన్‌వో, ఆయుష్ వైద్యాధికారి, ఆయుష్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఇందులో సంవత్సర కాలంగా ఎఫ్ఎన్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఆయుష్ వైద్యాధికారి పోస్టు ఖాళీగానే ఉంది. కాగా పీహెచ్‌సీలో ఒక వైద్యాధికారి, ఫార్మాసిస్టు, సీహెచ్‌వో, సూపర్‌వైజర్, స్టాఫ్‌నర్సు ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్‌వో, వాటర్‌మెన్, అటెండర్, స్వీపర్, యూడీసీ పోస్టులు ఉంటాయి. ఈపోస్టులు ఈ ఆస్పత్రిలో కల్పించలేదు. కాగా 2006 నుంచి ఆస్పత్రిలో సివిల్ డిస్పెన్సరీ స్థాయి సిబ్బందే కొనసాగుతుండటంతో మండల కేంద్రంలోని ఈ ఆస్పత్రిలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆస్పత్రికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమని బోర్డు తగిలించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆస్పత్రిలో ఆ స్థాయిలో పోస్టులు కేటాయించకపోవటంతో ఇది సివిల్ డిస్పెన్సరీనా? లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రమా? అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### ఆస్పత్రిని ఊడ్చేదెవరు?

ఆస్పత్రిలో ఉన్న స్వీపర్‌ను వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. దీంతో ఆస్పత్రిలో ప్రతీరోజు ఊడ్చేవారు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రిలో ఎవరు శుభ్రం చేయాలనే ప్రశ్న తలెత్తుతోంది. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఇతర సిబ్బంది ఆస్పత్రిని ఊడ్చేందుకు వెనకాముందు ఆలోచిస్తున్నారు. దీంతో ఆస్పత్రిని శుభ్రం చేసేవారు లేక ఆస్పత్రికి వచ్చే రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. డిప్యూటేషన్‌పై జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి తీసుకున్న స్వీపర్‌ను తిరిగి ఇక్కడికి పంపించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై వైద్యాధికారి శాంతిని సంప్రదించగా స్వీపర్ డిప్యూటేషన్‌పై వెళ్లడం వల్ల ఆస్పత్రిని శుభ్రం చేసేందుకు కష్టమవుతోందన్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారికి తెలియజేశామని, వేరే స్వీపర్‌నైనా ఇవ్వాలని, లేదా డిప్యూటేషన్‌పై తీసుకున్న స్వీపర్‌ను తిరిగి పంపించాలని జిల్లా వైద్యాధికారిని కోరామని ఆమె చెప్పారు.

# పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..

(ఐదో పేజీ తరువాయి)

అక్టోబర్, నవంబర్ నెలల్లో సరఫరా చేయనున్నారు. జిల్లాకు 165 టైటిల్స్ పాఠ్య పుస్తకాలు సరఫరా కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 150 టైటిల్స్ పాఠ్య పుస్తకాలు సరఫరా చేశారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను శివారెడ్డిపేట పారిశ్రామికవాడలోని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల సరఫరా కేంద్రంలో నిల్వ చేశారు.

### 1,20,508 వేల పాఠ్య పుస్తకాలు పంపిణీ

ఐదు రోజులుగా పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 1,20,508 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఎస్ఎల్‌బీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలతో పాటు బషీరాబాద్, దౌల్తాబాద్, కొడంగల్, యాలాల్ మండలాలకు సరఫరా చేశారు. జిల్లాలో గురుకుల పాఠశాలలతో పాటు మండలాలకు 26.8 శాతం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

### తొలిరోజే పంపిణీ

విద్యా సంవత్సరం ప్రారంభం రోజున విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేలా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలు ఉండడంతో ఆ మూడు మీడియాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. ఈనెలాఖరులోగా జిల్లాకు అవసరమైన పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యే అవకాశాలున్నాయి. ముందుగా మండలాల వారీగా మండల వనరుల కేంద్రాలకు సరఫరా చేసి అక్కడి నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను తరలించాలని విద్యా శాఖ అధికారులు యోచిస్తున్నారు.

### పాఠశాలలు తెరిచే నాటికే..

గతంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత చాలా రోజులవరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేవి కాదు. తరగతులు ప్రారంభమైనా పుస్తకాలు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభమైతే పుస్తకాల సరఫరా సెప్టెంబర్, అక్టోబరు నెలల వరకు కొనసాగేది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది.

పాఠ్య పుస్తకాల(పార్ట్-1) వివరాలు

| మండలం | పాఠ్య పుస్తకాలు (కావాల్సినవి) |
|---|---|
| బంట్వారం | 5,983 |
| కోట్‌పల్లి | 7,939 |
| నవాబ్‌పేట్ | 9,514 |
| బషీరాబాద్ | 23,488 |
| బొంరాస్‌పేట్ | 13,481 |
| చౌడాపూర్ | 12,005 |
| ధారూరు | 16,743 |
| దోమ | 26,154 |
| దౌల్తాబాద్ | 18,812 |
| దుద్యాల్ | 11,178 |
| కొడంగల్ | 26,530 |
| కులకచర్ల | 18,295 |
| మర్పల్లి | 17,062 |
| మోమిన్‌పేట్ | 14,947 |
| పరిగి | 25,886 |
| పెద్దేముల్ | 21,876 |
| పూడూరు | 17,167 |
| తాండూరు | 50,955 |
| వికారాబాద్ | 31,102 |
| యాలాల్ | 28,401 |
| గురుకుల పాఠశాలలు | 28,401 |
| ఇతర పాఠశాలలు | 13,965 |

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం



పెద్దేముల్: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

దుద్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా వృత్యంతర శిక్షణను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో విజయరామారావు తెలిపారు. ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, ఆర్పీలు వెంకటయ్య, సంపత్, అశోక్ గౌడ్, శంకరప్ప, తేజస్వీని, అస్మా, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: విద్యార్థుల స్థాయికి తగిన విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులకు జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నర్సింగ్‌రావు, తహసీల్దారు వెంకటేష్ ప్రసాద్, ఎంపీడీవో రతన్‌సింగ్, శిక్షణాతరగతుల ఇంచార్జ్ ద్యావరి నరేందర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ బంద్యప్ప, నర్సిరెడ్డి, విజయనర్సిములు, శోభన్‌బాబు, రహమత్ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల: మాట్లాడుతున్న ఎంఈవో విజయరామారావు

దోమ: మండల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు కేజీబీవీ పాఠశాలలో శిక్షణ నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి సబ్జెక్టు అబ్జర్వర్స్ నాగరాజు, నర్సింహా, రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, మండల రీసోర్స్ పర్సన్‌లు వెంకటచారి, శ్రీనివాస్, మోహనచారి, శ్రీనివాస్, రవి, సతీశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పరిరక్షించాలి



అమృత్ మిత్ర కార్యక్రమంలో బలరాంనాయక్

కొడంగల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. కొడంగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం అమృత్‌మిత్ర కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలకు మొక్కలు నాటడం, పర్యవేక్షణ బాధ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పట్టణ సమన్వయ అధికారి వెంకటేశ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ భరత్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బొంరాస్‌పేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రెయినీ ఎస్ఐ మోహన్ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలను ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఒగ్గు కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

యాలాల, మే 22, (ఆంధ్రజ్యోతి) మండలంలోని పగిడిపల్లికి చెందిన యువ ఒగ్గు కళాకారుడు కుర్వ నవీన్‌కుమార్ గురువారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి, నాందార్‌పూర్ బృందం తరఫున మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి, నాందార్‌పూర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఒగ్గు బీరప్ప, రాఘవేందర్, నవీన్, నితిన్, మహేష్, తుల్జప్ప, నర్సింహులు, మహేష్, ప్రసాద్, భాను, భార్గవ్, శివా పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు

బొంరాస్‌పేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ రైతులు పంటలను సాగుచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పంటలసాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త పరిమళ, వ్యవసాయ అధికారి పోలప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి



కీసర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ మన్యసూక్త హోమం నిర్వహిస్తున్న భక్తులు

మేడ్చల్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. పూడూరులోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి, చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహ్మా స్వామి ఆలయాలతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలతో నవకలశాభిషేకం, మన్యసూక్త హోమాలు, హనుమాన్ చాలీసా పారాయణం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు.

ఘట్‌కేసర్ రూరల్: హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అవుశాపూర్, అంకుశాపూర్, మర్రిపల్లిగూడ, ఎదులాబాద్, ఘనాపూర్ కొర్రెముల, ప్రతాప్‌సింగారం, కాచవానిసింగారం, వెంకటాపూర్ గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్‌కు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మహేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, లింగంముదిరాజ్, శ్రీశైలం, గోవర్దన్, హరికృష్ణ, సాయి పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్‌లో గురువారం హనుమాన్ జయంతిని గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే సమయంలో గ్రామంలోని భజన భక్తులు భజనలు చేశారు. అనంతరం గ్రామస్థులు, భజనమండలి సభ్యులు భజనలు చేస్తూ స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు.



దోమ: బడెంపల్లి హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: బడెంపల్లిలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పరిగి మాజీ ఎమ్మెల్యే కే.మహేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచ్‌లు కే.రాజిరెడ్డి, కవిత శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మసక మసక చీకటిలో..

(ఐదో పేజీ తరువాయి)

సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడో దూరంగా ఉండే ప్లాట్ల యజమానులు వచ్చి చూసుకునే సరికి మట్టి మొత్తం మాయమై బొందలు దర్శనమిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. మట్టికోసం వ్యాపారులు ఎలాంటి అక్రమాలకైనా వెనుకాడటం లేదు. రైతుల వద్దకు వెళ్లి ఎంతో కొంతకు మాట్లాడుకుంటున్నారు. అన్ని అనుమతులను తామే తీసుకుంటామని చెప్పి ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు పూర్తి చేసుకొని వెళ్లిపోతున్నారు. ప్రధాన రోడ్డు పక్కనే భారీ యంత్రాలను ఉపయోగించి మట్టి తవ్వకాలు చేస్తూ పదుల సంఖ్యలో టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం.

### అడ్డదారుల్లో..

మట్టిని ఒకచోటు నుంచి మరో చోటుకి తరలించాలంటే మైనింగ్ అనుమతులు తప్పనిసరి. అనుమతించిన మేరకే మట్టిని తీయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఖర్చుతో కూడుకున్న అంశం కావడంతో అక్రమార్కులు అడ్డదారులనే ఎంచుకుంటున్నారు. అవసరమైతే ఆయా శాఖల అధికారులను ప్రసన్నం చేసుకొని తమ పనులను పూర్తి చేసుకుంటున్నారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని గుట్ట నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టిని మర్పల్లిగూడ రెవెన్యూ పరిధిలోని ఓ బఫర్ స్థలాన్ని నింపేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇకనైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధిలోని చందుపట్లగూడ వద్ద మట్టి తవ్వకాలపై వివరణ కోసం ఘట్‌కేసర్ తహసీల్దార్ రజనికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌ను వివరణ కోరగా ఆయప స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుటామని తెలిపారు.

## బీజేపీ తిరంగా ర్యాలీ

బంట్వారం మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తిచేసిన భారత సైనికులకు గౌరవ సూచికగా గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్, మండల జనరల్ సెక్రటరీ మల్లేశం పాల్గొన్నారు.



బంట్వారం: తిరంగా ర్యాలీలో నాయకులు

పెద్దేముల్: భారత సైనికుల సేవలు అజరామరమని మండల విద్యాధికారి నర్సింగ్‌రావు కొనియాడారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో జరిగిన తిరంగా కార్యక్రమంలో గురువారం మాజీ సైనికుడు విద్యాసాగర్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారతీయ సైనికుల సేవలను, వారు సాధించిన విజయాలను ఉపాధ్యాయులంతా కొనియాడారు.

## ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బొంరాస్‌పేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు, పాఠ్యపుస్తకాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, గ్రామస్థులు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎరువులు అందుబాటులో ఉంచాలి

తాండూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వేసే పంటలకు ఎరువులు అందుబాటులో ఉంచాలని తాండూరు మండల వ్యవసాయాధికారి కొమరయ్య అన్నారు. ఎల్మకన్నె సహకార సంఘాన్ని గురువారం ఆయన సందర్శించారు. సహకార సంఘం పరిధిలో డీఏపీ 42మెట్రిక్ టన్నుల డీఏపీ, 27మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచినట్లు సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డిలు కొమరయ్య తెలిపారు. అనంతరం ఎల్మకన్నె సహకార సంఘం సమీపంలో రసాయనిక ఎరువులు నిల్వ చేసేందుకు ఇటీవల లీజుకు తీసుకున్న గోదాంను పరిశీలించారు.

## పేదలకు అండగా కేఎస్ఆర్ ట్రస్టు

పరిగి, మే 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు విద్య, క్రీడల పరంగా కేఎస్ఆర్ ట్రస్టు అండగా ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఎన్‌బీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు సభకు ఆమె హాజరై క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లక్ష్మణ్, శ్రీశైలం, క్యాంపు నిర్వాహకులు శ్రీనునాయక్, రమేశ్, కోచ్ రిషికేశ్వర్, శివ కుమార్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### అనంతగిరి ఘాట్ రోడ్డులో లారీ బోల్తా



అనంతగిరి ఘాట్ రోడ్డులో బోల్తాపడిన కట్టెల లారీ

వికారాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ అనంతగిరి ఘాట్ రోడ్డులో లారీ బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి ధారూరు సమీపంలోని ఓ కంపెనీకి ఓ లారీ కట్టెల లోడుతో గురువారం ఉదయం బయల్దేరింది. నందిఘాట్ వద్ద బ్రేకులు ఫెయిల్ అయి ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయే ప్రయత్నంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సురేష్ బాబు, క్లీనర్‌కు గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై కట్టెల లారీ పడడంతో కొంత ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): తనకున్న వ్యాధి బాధను భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పూడూరు మండలంలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కెపల్లికి చెందిన చాకలి మల్లయ్య(43) ఐదేళ్లుగా సోరియాసిస్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భోజనం తర్వాత ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య చాకలి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కులకచర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మైనర్లు గాయాలపాలయ్యారు. మండలంలోని పీరంపల్లికి చెందిన బాలురు దర్శనం నిమిత్తం ఒకే సైకిల్‌పై పాంబండ ఆలయానికి వచ్చి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆలయం మలుపులో అతివేగంగా వెళ్తున్న వారు రోడ్డుపక్కన పడిపోయారు. దీంతో గ్రామానికి చెందిన కమ్మరి శివకుమార్, మహేశ్‌బాబు, ఈశ్వర్‌కు గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రమాదంలో జింక మృత్యువాత

చౌడాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మరికల్ గ్రామంలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ జింక గాయపడింది. గాయపడిన జింకను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లల మర్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృత్యువాతపడింది. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో పశువైద్యుడు హతిరామ్ పోస్టుమార్టం నిర్వహించారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవు..

దోమ, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవు మృత్యువాతపడింది. మండలంలోని బాసుపల్లి గేటు సమీపంలో పరిగి నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో బాసుపల్లి గ్రామ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన ఆంజనేయులు ఫాంహౌస్ ఉంది. అందులో ఆ యజమానివి కొన్ని పశువులు ఉన్నాయి. వాటి పోషణ పాలేరు వారు చూసుకుంటారు. గురువారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా పరిగి నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆవును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆవు అక్కడికక్కడే మృత్యువాతపడింది. విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### నిందితుల పరారీ

కొడంగల్/దౌల్తాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో అన్నదమ్ముల గొడవలో దాడికి పాల్పడిన కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన మసూద్ అనే వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో ఉండగా నిందితుడు కోర్టుకు హాజరుకావడం లేదు. ఈమేరకు కొడంగల్ మున్సిఫ్ కోర్టు మసూద్ పరారీలో ఉన్నట్లు పరిగణించినట్లు ఎస్ఐ జీవీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో లేదా సెల్‌నెంబర్ 8712670046కు సంప్రదించాలని కోరారు. అదే విధంగా దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన తోకని ఏసు అన్నదమ్ముల గొడవలో దాడికి పాల్పడగా దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టుకు హాజరుకాకపోవడంతో నిందితుడు పరారీలో ఉన్నట్లు కొడంగల్ మున్సిఫ్ కోర్టు పరిగణించిందని ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కోర్టులో గానీ, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ

యాలాల, మే 22, (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు పోగొట్టుకుని ఫిర్యాదు చేసిన వారికి ఫోన్లు రికవరీ చేసినట్లు యాలాల ఎస్ఐ గిరి తెలిపారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఉషెనప్ప, దౌలాపూర్‌కు చెందిన సయ్యద్ కాఫర్ ఖాద్రి, కొత్లాపూర్‌కు చెందిన బోయిన మహేష్, రెడ్డిఘనాపూర్‌కు చెందిన ముదిరాజ్ ప్రశాంత్‌లు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదులు చేశారని తెలిపారు. ఈ మేరకు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

### 10 పందులు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పందులు అపహరణకు గురైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైం ఎస్ఐ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. పోచారం మున్సిపాలిటీ, కొర్రెములకు చెందిన బిజిలి మహేష్ బుధవారం రాత్రి తనకున్న 10 పందులను షెడ్‌లో పెట్టి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూసేవరికి పందులు కనిపించలేదు. స్థానికులను విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

## 'రాజీవ్ యువ వికాస్' దరఖాస్తుల పరిశీలన

తాండూరు రూరల్, మే 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 గ్రామపంచాయతీలు, ఎనిమిది అనుబంధ గ్రామాలకు రాజీవ్ యువ వికాస్ పథకం కింద 2,210 దరఖాస్తులు అందాయని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. ఆయన గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తాండూరు పరిధిలోని రాజీవ్ యువ వికాస్ పథకం కింద రుణాలు అందించేందుకు ఎస్‌బీఐ మల్కాపూర్, ఎస్‌బీఐ కరన్‌కోట్, ఎస్‌బీఐ తాండూరు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులు ముందుకు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 2,210 దరఖాస్తులపై సమగ్ర వివరాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. తాండూరు మండలానికి బీసీలకు 293 యూనిట్లు, ఈబీసీలకు 101, ఎస్టీలకు 71, మైనార్టీలకు 66 యూనిట్లు క్రిస్టియన్ మైనార్టీలకు 4 యూనిట్లు, వికలాంగులకు 1, ఎస్సీలకు 265 యూనిట్లు కాగా, మొత్తం 801 యూనిట్ మంజూరైనట్లు తెలిపారు. ఇట్టి యూనిట్లపై ఆయా బ్యాంకర్లు సిబిల్ స్కోరు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి సిబిల్ స్కోర్ వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు.